ఆదివారం
ప్రజాశక్తి
6 జనవరి, 2002

అంతరిస్తున్న
అరుదైన పాండా

లోపలి కవర్‌పేజీలో
కులాతీత వివాహవేదిక

కులాతీత వివాహావేదిక

వధువు కావలెను

✡ 25/బిఎస్సీ/5'.10"/చామనఛాయ/సోషల్‌వర్కర్/ప.గో.జిల్లా వరునికి 20-23 వయస్సు/5'.5"-చామన ఛాయ/డిగ్రీ/ఆదాయం ఉన్నా లేకున్నా/ ఏ జిల్లాకు చెందిన వారైనా అర్థం చేసుకొని అనుకూలంగా ఉండే వధువు కావలెను. బాక్స్ నెం : **109** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 28/5'.3"/బి.ఎ.,ఐటిఐ/మున్సిపల్ ఆఫీసులో కాంట్రాక్టు ఎన్ఎంఆర్/ఆదాయం 1500/కర్నూలు జిల్లా వరునికి తగిన వధువు కావలెను. బాక్స్ నెం : **110** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 30/5'.7"/ఎం.ఎ.సోషియాలజీ, ఎం ఎస్‌డబ్ల్యు-ఫస్ట్ ఇయర్/ ప్రైవేట్‌జాబ్ -ఆదాయం 5వేలు/మంచి భావాలు గల/ మహబూబ్‌నగర్ జిల్లా వరునికి 28/5'.3"/పి.జి లేదా డిగ్రీ/ ఉద్యోగం గల/ఏ జిల్లా వారైనా మంచి భావాలు గల వధువు కావలెను. బాక్స్ నెం : **111** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 28/5'.5"/ఎంఎస్సీ బిఇడి-మ్యాథ్స్/తెలుగు/ప్రైవేట్ జూనియర్ లెక్చరర్/ఆదాయం నెలకు 8వేలు/ఇల్లు, 2ఎకరాల మాగాణి గల ఖమ్మం జిల్లా వరునికి 23/5'.1"-5'.4"/ ఎంఎస్సీ, బిఎస్సీ/ఎరుపు/ఆదాయం ఉన్నా లేకున్నా/ ఏ జిల్లా వారైనా సంప్రదించవచ్చు. బాక్స్ నెం : **112** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 35/5'.4"/చామనఛాయ/ఎంఎ-టిటిసి/ప్రభుత్వ టీచర్/ఆదాయం నెలకు రూ.5371/ఖమ్మం జిల్లాలో ఉద్యోగం చేస్తున్న అభ్యుదయ, ప్రజాతంత్ర భావాలు గల/లేటు మ్యారేజీ వరునికి 28 ఆపై వయస్సు/ డిగ్రీ లేదా పి.జి./5'.3"/ఉద్యోగం ఉన్నా లేకున్నా ఫరవాలేదు/ ఆదర్శ, అభ్యుదయ భావాలు గల/ తెలంగాణా జిల్లాల నుండి వధువు కావలెను. బాక్స్ నెం : **113** కేరాఫ్ ప్రజాశక్తి.

వరుడు కావలెను

❊ 20/5'.2"/3వ తరగతి/ అందగత్తె-ఎరువు/ ఆదాయం రూ.1000/ మంచి నడవడిక గల అమ్మాయి/ కృష్ణా జిల్లా వధువుకి 25-30 ఏళ్ళలోపు వయస్సు/5'.2" ఆపై ఎత్తు/4 వేల నుండి ఆరువేల ఆదాయం వచ్చే ఏదేనీ చిరుద్యోగం/ మంచిగుణంకల/ ఏ జిల్లాకు చెందిన వారైనా కావలెను. బాక్స్ నెం :**132** కేరాఫ్ ప్రజాశక్తి.

❊ 28/5'.2"/ఛామనచాయ/ బికాం పిజిడిసిఎ/డైవోర్సీ/ అనంతపురం జిల్లా వధువుకి తగిన వరుడు కావలెను. బాక్స్ నెం :**135** కేరాఫ్ ప్రజాశక్తి.

❊ 29/5'.1"/బికాం కంప్యూటర్స్/ప్రైవేటు జాబు/ ఆదాయం రూ.3000/ సంగీత సాహిత్యాలపై అభిరుచి అభ్యుదయ భావాలుగల/ తూర్పుగోదావరి జిల్లా వధువుకి 30-32 ఏళ్ళ వయస్సు/5'.3" ఆపై ఎత్తు/ తగిన ఆదాయం/ అభ్యుదయ భావాలు, విశాల దృక్పథం కలిగిన/ ఏజిల్లానుండైనా వరుడు కావలెను. బాక్స్ నెం :**137** కేరాఫ్ ప్రజాశక్తి.

ప్రజాశక్తి — **వివాహ వేదిక కూపన్**

వధువు/వరుడు కావలెను

వయస్సు : ....

చదువు : ....

ఎత్తు /ఛాయ: ....

ఉద్యోగం : ....

జిల్లా : ....

ఇతరములు : ....

....

గల వధువు/వరునికి......

వయస్సు : ....

చదువు : ....

ఎత్తు/ఛాయ: ....

ఉద్యోగం : ....

జిల్లా : ....

ఇతరములు : ....

....................................గల కుల, మత ప్రసక్తిలేని వారు కావలెను.

బాక్స్‌నెంబర్:

ఇచ్చిన వారి సంతకం　　　　పూర్తి చిరునామా :

నోట్ : ఈ శీర్షికలో వివరాల ప్రచురణ ఉచితం. ఈ కూపన్‌ను మాత్రమే ఉపయోగించాలి. రు. 8 స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవర్ జత చేయాలి.

వివాహావేదిక, ప్రజాశక్తి కార్యాలయం, 1-1-298/4, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

చిన్నారి చిత్రకారులు



జి. లక్ష్మి, 8వ తరగతి
జడ్‌పి హైస్కూల్, బొండపల్లి, విశాఖ

సిహెచ్. కృష్ణ సుకుమార్ శర్మ, 4వ తరగతి
కీర్తి విద్యాలయం, మంగంపల్లి



జి. భార్గవి, 7వ తరగతి
శ్రీ సుబ్బయ్య విద్యానికేతన్, మార్కాపురం

జి. అనిల్‌కుమార్, 6వ తరగతి
జె. శాసనాం, కంచిలి, శ్రీకాకుళం జిల్లా



ఆహ్వానం

ప్రజాశక్తి 'హ్యాపీ బర్త్‌డే'

విభిన్న శీర్షికలతో పాఠకుల అభిమానం చూరగొంటున్న 'ప్రజాశక్తి' మీ చిన్నారులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయాలనుకుంటోంది. ఐదేళ్ల వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టినరోజుకు నెల రోజుల ముందుగా వివరాలు పంపడమే. **మీ చిన్నారి పేరు, వయస్సు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఊరిపేరు తదితర వివరాలతో ఓ కలర్‌ఫొటో జతచేసి పంపాలి.** మీ చిన్నారి పుట్టినరోజు ఉన్న వారంలో వెలవడే ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ఫొటో, వివరాలు ప్రచురించడం జరుగుతుంది. మీకు ఎంతో ఆనందం కలిగించే మీ ఇంటి దీపాల పుట్టిన రోజు వేడుకలను ప్రజాశక్తి అభినందనలతో జరుపుకోండి.

ఇట్లు
ఎడిటర్

పంపవలసిన చిరునామా: హ్యాపీబర్త్‌డే, కేరాఫ్ సండే సెక్షన్, ప్రజాశక్తి కార్యాలయం, ప్లాట్ నెం : 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20 ఫోన్ : 7673787, 7665420

ఎండిన ఏడు చేపలూ - దండిగా యూజర్ ఛార్జీలు!

రుక్మిణి

"ఒరేయ్ మనవడా... ఒక మంచి కథ చెప్తాగానీ.. రా.. అట్లా కూర్చో!"

"ఏం కథా.. ఒకరాజు.. ఏడుగురు కొడుకులు... వేటకుపోతే ఏడు చేపలు.. ఛు.. ముసిలి కథలు.. నాకొద్దు!" వీరూగాడు నిక్కరు పిర్రలమీదకు లాక్కుంటూ ధుమధుమలాడుతుండగా తాత ముందు బిత్తర పోయాడు. "టి.వి.లో మంచి సీరియల్.. హైటెక్ కథలొస్తున్నాయి. అవి చెప్పరాదూ!"

తాతయ్య గొంతు సవరించుకొని కథ మొదలు పెట్టాడు.

* * *

విచిత్రం! మధ్యాహ్నం కావస్తున్నా ఈదరగాలి వదలడం లేదు. అటు చూస్తే జైలు గోడలూ... దాని భారీ గేటూ... జమాన్లు.. కాపలా అంతా పకడ్బందీగా వుందాయె! అబ్బో! వందేండ్లయినా అయుంటుంది. ఏ మహానుభావుడు తనలాటోల్ల కోసం కట్టించి పారేసినాడో గదా! అరె... కంట్రాక్టరు బాబు కరుకు కరక్కాయలాంటోడు కావచ్చు. పకడ్బందీ... ఇటు వానకూ... అటు ఎండకు... ఈ చలిదెబ్బకూ లోపల సుఖంగా వుండేట్టు భలే పసందుగా కట్టించేసినాడు గదా! ఓహో.. ఆహా.. రంగప్ప బహు ఆనందంగా.. మురిపెంగా మూడ్నెల్లు దాన్లో తాను గడపబోయే రోజులను తలుచుకు ఉబ్బితబ్బిబ్బులై పోతున్నాడు. హమ్మయ్య! ముప్పూటలా మూతి తుడుచుకుని బేవురుమనవచ్చు. ఈ చలీ పులీ గిలీ జాన్తానై కంబళీ క్రింద కలుగులో కొక్కులా ఎంత హాయి!

జైలరుగారి మంద్ర స్వరపు మందలింపుతో రంగప్ప మన లోకంలోకి వచ్చి పడ్డాడు. "రంగప్పగారూ! (ఆహా - ఓహో) తమరు ఈ కారాగారమునందు కచ్చితముగా మూడు నెలలు గడపవలయునని కోర్టువారి తీర్పు! మరి తమరు సదరు కారాగారపు యూజరు ఛార్జీలను తక్షణమే చెల్లించిలోనికి దయచేయండి!"

రంగప్ప తల గిరగిరా తిరిగి, ఒకసారి చలికి వణికి ఒంటిని తేరిపార చూసుకున్నాడు. ఒంటిమీద కట్ డ్రాయరు తప్ప మరేమీ లేదాయె!

"యూజరు ఛార్జీలు? ఏందీ... మూడ్నెల్లు నాకు జైలు శిక్ష.. దానికి నేను ఛార్జీలు కట్టాలె!" ఆ జైలు పెద్ద గేటు అధాటున మీద కూలినంతగా రంగప్ప భయభ్రాంతుడైనాడు.

"అవ్వనా ఉల్చా రంగప్పా.. (హబ్బో గోరం) ఇదేం నీ అత్తగారిల్లనుకున్నావ్‌రా (గోరం) పట్టిందనక మేసి బొర్రలు పెంచుకుని నిగడదీసి పండుకోడాన్కి.. అరె.. నీ కాపలా కర్చంతా ఎవడు యాడ్నుంచి తెచ్చిపెడ్తారని మీరనుకుంట్రా! జైల్లో సంస్కరణల సంగతి సరిగ్గా తెల్వదేర బేవకూఫ్!"

"హా... జైల్లో.. పోలీసు స్టేషన్లో... కోర్టుల్లో కూడా సంస్కరణలు.. ప్రైవేటు.." రంగప్ప మెదడంతా మొద్దుబారి కళ్ళకు చీకట్లు కమ్మినట్లయి అక్కడే అరుగు మీదికి జారగిల బడ్డాడు. అసలు జరిగిందేమిటంటే -

* * *

అనగనగా ఒక ఊర్లో.. ఏ బతుకు దెరువూలేక.. ఉపాధి దొరక్క.. చెంద్రబాబుగారు చెప్పినట్లు తన కాళ్ళమీద తాను నిలబడలేక మంది జేబులు కత్తిరించడం అలవాటు చేసుకున్నాడు రంగప్ప! అలవాటు అభివృద్ధిచెంది... చెంది ముందు రోజుల్లో తన కొంపాగాకుండా 'ప్రైవేటీకరణ' అంటే 'పరాయి' కొంపలకు నేర్పుగా కన్నాలు వేయడం.. తన సేవలకు ప్రతిఫలంగా చెంబూ.. తప్పేలా.. ముంతా..మూకుడు.. గొర్రె.. మేకా... దొరికినపుడు వాచీలు (విదేశీ), ఉంగరాలు (స్వదేశీ) ప్రైవేటుగానే స్వంతం చేసుకుంటూ స్వర్ణాంధ్రను సాధించడంలో ఇతోధికంగా కృషిచేస్తున్న నేపథ్యంలో ఒక చిన్న పిల్ల మెడలోనుండి ఒంటిపేట గొలుసును ప్రైవేటీకరణ చేసి ప్రైవేటుగానే పోలీసు వారికి దొరికిపోయాడు.

పోలీసు స్టేషన్లో -

"ఓర్నీ... రంగప్పా... సువ్వర్... పసిపిల్ల గొలుసు కొట్టేస్తావ్‌రా! ఇంకా దొంగతనాలు 'స్వయం ఉపాధి పథకాలంటావ్! అరె... అవింకా ఏ షరతులూ ఒప్పందాల్లోకి రాలేదురా... (అప్పటికే రంగప్పను మూడు నాలుగు దఫాలు 'సత్కారం' చేయడంతో ఒళ్ళంతా హూనమై మూలగడం మాత్రమే చేస్తూ ముడుచుకున్నాడు) చల్లో... ఇంగవీడ్ని కోర్టుకు...చల్... చల్..!"

పోలీసు స్టేషన్లో చితకబాదడం.. సొమ్ము స్వాధీనం... నేరం అంగీకారం.. యప్పియ్యార్.. సాక్ష్యం.. తంతూ తతంగం అయ్యేసరికి రంగప్ప 'చీకిరి చింగప్ప'లా తయారయ్యాడు.

"ఆc.. ఆc... సర్సరె.. మిస్టర్ శ్రీ రంగప్పగారూ... తయారు చేసిన దొంగతనాన్ని కడునేర్పుగా పరిశోధించి... తమర్ని బంధించి... ఈ స్టేషన్లో కుందాపోట్లకు... పూటకు ఓసారి కుమ్మిన... దరిమిలా మింజుమితె నాలుగు సార్లు కుళ్ళబొడిచినందుకు మొత్తం యూజర్ ఛార్జీల క్రింద మూడు వందలా ముప్పై మూడు రూపాయలు... కట్టితీరవలె.. రూలు.." యస్సయ్ చెప్పుకుపోతున్నా కొయ్యబారిన రంగప్ప వినే స్థితిలో లేదు. కావున ఒకవేపు షరతులూ.... మరోవేపు రూలూ.. రూలుకర్ర కావున అట్టి సదరు యూజరు ఛార్జీ కిందగాను సదరు పోలీసువారు రంగప్ప రంగురంగుల సిలుకు చొక్కాను సగౌరవముగా వూడదీసి, తాత్కాలిక జమా, పద్దుల క్రింద స్వాధీన పరుచుకున్న వారాయెను!

మరి ఇక్కడ కోర్టులో -

"రంగప్పా... నువు నేరం చేసినావని తేలికగానే రుజువైపోయింది. కష్టంగా రుజువైతే నీకింకా కష్టాల లిస్టు పెరిగిపోయేది. నయమే! కావున కోర్టువారు తమరికి మూడునెలల కారాగారవాస శిక్ష విధిస్తూ తీర్పునిస్తున్నారు!"

తీర్పువిని రంగప్ప చొక్కాలేని తన ఛాతీనో లేక జబ్బల్నో పెళపెళ చరుచుకుందామనుకుని బాగుండదని అప్పటికి తమాయించుకున్నాడు.

"అయితే సదరు రంగప్పగారికి ఈ శిక్ష విధించిన సదరు కోర్టు యావత్తు కార్యక్రమానికిగాను 'సేవ'కు గానూ యూజరు ఛార్జీల క్రింద నూటాయాభైరూపాయలు చెల్లించవలసినదిగా కోరనైనది.

రంగప్ప బుర్ర గిరగిరా తిరగగా.. కోర్టు సిబ్బంది మాత్రం అట్టి సదరు చార్జీల కింద చారల పంట్లామును (బెల్టుతో సహా) ఊడబెరుక్కున్నపుడు జబ్బలకు బదులుగా లపలప నెత్తీనోరూ బాదుకుని కట్ డ్రాయరుతో మాత్రమే తన మానాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశాడు!

ప్రస్తుతం జైలు అనబడు కారాగారము వద్ద -

"అరె బాంచెత్... అయితే దబ్బు కట్టంది నన్ను జెయిల్లో నూకరు. మరయితే నేను ఎటుబోవాలె! యాడ చావాలె! హత్తెరి!" అరుపులు అరిచి తిరిగి వచ్చి కోర్టువారినడిగాడు.

"కోర్టువారూ.. జడ్జిగారూ... ఏమిటి? ఎందుకు సంగతి?"

"అబ్బే.. మాకేం తెలవదు రంగప్పా .. నువు పోలీసువారి నడుగు!"

"పోలీసువారూ.. వీపు పగలేసేవారూ.. ఏమిటి? ఎందుకు సంగతి?"

"అరే రంగప్పా... నువ్వు గొలుసు దొంగతనం చేసినావు.. పోయి స్వంతదారునడుగు!"

"ఓయీ పసిపాపా... పసిపాపా.. ఈ గొలుసేంటి? ఏమిటి? ఎందుకు సంగతి?"

"రంగప్పా... రంగప్పా... నాకేం తెలుసూ.. గొలుసుకేం తెలుసూ.. మా అయ్యనడుగు!"

"ఓ పాపయ్యా! పాప అయ్యా! గొలుసేంటి? ఏమిటి? ఎందుకు సంగతి?"

పాపయ్య వెంటనే తాంద్ర పాపారాయుడిలా మీసాలు మెలివేశాడు! "ఎవడ్రా నువ్.. మా అమ్మాయి మెడలో గొలుసు దొబ్బిందిగాక... నువు జేల్లో వుంటానికి యూజర్ ఛార్జీలు వాళ్ళు నిన్ను కట్టమంటే - నువు నన్నడుగుతావ్ - మక్కెలిరగదంతా!"

"వాటి నెవడో పోలీసోడు ఇరగదీసిందుగానీ... అసలు నీ పాపమెడలో నువు గొలుసు దిగేయడంతోనే మరి ఈ దొంగతనం జరిగింది. వేయకుంటే.. గొలుసు వేయకుంటే... కుంటే... కుంటే...

రంగప్ప హుషారెక్కి ఈలవేశాడు. పాపయ్య అవమాన భారంతో ఒళ్ళూ పైతెలీకుండా దహించుకు పోయాడు. వీడు చెప్పిందాన్లో కాస్తో - కూస్తో నిజవూ నిజాయితీ ఏడిచినట్లుంది. వేయకుంటే... వేయకుంటే.. కుంటే.. కుంటే...కుం...

"పావమ్మా... పాపీ పావమ్మా! తాంద్రపాపారాయుడు భార్యను పెడబొబ్బలు పెట్టే సరికి రంగప్ప హడలిపోయాడు.

"ఏమే పాపమ్మా... పాపీ ఈ ఆడకూతుర్ని 'కనవద్దే' అంటే కనేసి పాపం ఈ రంగప్పగారి మెడకు జైలు యూజర్ ఛార్జీలు తగిలిస్తివి. ఛీ.. ఛీ.. నీ మొహం చూస్తే పాపం.. ఆ ఆడపోర్ని కనవద్దని నేను చెప్పానా లేదా? చెప్పు.. చెప్పు!"

"మగడా.. నా మొగవాడా... నలుగురు మగబిడ్డల తర్వాత నేను మరింక అసలు సంతానం వద్దే వద్దని గవర్మెంటు ఆస్పత్రికి ఆపరేషనుకనే పోతినిగదా... చేయమంటిని గదా...వాండ్లేమో యూజర్ ఛార్జీలని గింత లావున దండకం చదివే సరికి దడబుట్టి ఆ దెబ్బకు బయట పడితిని.. గా దెబ్బల గిది పుట్టె... నువు గొలుసు దెచ్చి దాని మెడల వేస్తివి...

అప్పటికి కాస్తంత ఎండదెబ్బ తగిలి వీధి అరుగుమీద రంగప్ప సొమ్మసిల్లి గుర్రుకు తగులుకున్నాడు.

* * *

"ఛ... ఇదేం కథ తాతా?"

"అరే... కథింకా వుంది. అదేంటంటే ఇంతకీ ఆ రంగప్ప దొంగిలించిన గొలుసు బంగారపు గొలుసుకాదు. గిల్టు.. కురివి సంత సరుకు. మన స్వర్ణాంధ్ర గిల్టు సరుకు.

మనవడు ఎగిరి గంతేసి తాత మెడను కావిలించుకున్నాడు.

★

ప్రత్యర్థులను హడలెత్తిస్తున్న జోడీ

హసన్ షరీఫ్

ఆసిఫ్ సహీర్, అబ్దుల్ హకీమ్ ఏ జట్టు తరఫున మైదానంలో దిగుతారో ఆ జట్టు విజయం సునాయాసంగా మారుతుంది. వీరు మైదానంలోకి దిగితే గోల్‌కై వేటాడడంపైనే దృష్టినిలుపుతారు. ఇరువురి వయస్సు ఇరవై ఏళ్ళ పైచిలుకే. సహీర్ వయస్సు 23 ఏళ్ళు అయితే, హకీం వయస్సు 22 ఏళ్ళు. ఈ ఇరువురు స్ట్రయికర్ల ప్రతిభ కారణంగానే కేరళ ఇటీవల జరిగిన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను కైవసం చేసుకుంది. భారత ఫుట్‌బాల్‌కు ఈ టోర్నీ అత్యున్నతమైనది. ఆసిఫ్, హకీమ్ మైదానంలో పూర్తి అవగాహనాత్మక ఆటతీరును ప్రదర్శిస్తారు. "ఎస్‌బిటి (స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ట్రావెంకోర్) తరఫున ఆడిన తర్వాత మా మధ్య అవగాహన మరింత పెరిగింది" అని హకీం అన్నాడు. ఇతను అఖిలభారత ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కాలికట్ యూనివర్సిటీ తరఫున పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చాడు. దీంతో కేరళ జట్టులో స్థానం సంపాదించాడు. కేరళ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆశలకు తగ్గట్టుగానే రాణించిన హకీం 57వ సంతోష్ ట్రోఫీ టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఫైనల్లో ఇతని గోల్డెన్ గోల్ వల్లనే గోవాను కేరళ ఓడించి ట్రోఫీ కైవసం చేసుకోవడం విశేషం. మూడు మ్యాచ్‌లలో పాల్గొన్న హకీం ఏడు గోల్స్ చేశాడు. ఇతని సహచర స్ట్రయికర్ ఆసిఫ్ ఒకే గోల్‌తో (హకీం కంటే) వెనుకబడ్డాడు.

హకీం కంటే ఆసిఫ్ ఒక సంవత్సరం సీనియర్ ఆటగాడు. డిఫెండర్‌గా, గోల్ కీపర్‌గా అతను జాతీయ ఫుట్‌బాల్ లీగ్‌కు విశేష సేవలందించాడు. ముంబయి జాతీయ పోటీల్లో అందరి దృష్టి ఆసిఫ్‌పైనే పడింది. వారి అంచనాలకు తగ్గట్టుగానే అతను ఆ పోటీల్లో ఆరు గోల్స్ చేశాడు. తమిళనాడుతో జరిగిన ఒక మ్యాచ్‌లో ఒక వైపుకు ఒరిగి అద్భుత రీతిలో చేసిన గోల్ డ్రీమ్ గోల్‌గా అందరి మన్ననలు అందుకుంది. దీంతో సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లలో ప్రత్యర్థి జట్టుసభ్యులు అతన్ని చుట్టుముట్టి గోల్ చేయకుండా నిరోధించారు. అప్పుడు గోల్ చేసే అవకాశాన్ని హకీం చేజిక్కించుకొని సఫలీకృతుడయ్యాడు. ఈ రెండు మ్యాచ్‌లలో అతను మూడు గోల్స్ చేశాడు. ఎస్‌బిటి, కేరళ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆసిఫ్, హకీం మధ్య అద్భుత సమన్వయం ఉంది. ఇరువురూ గోల్స్ చేయడానికి పోటీపడ్తారు. 22 ఏళ్ళ హకీం తన సీనియర్ అయిన ఆసిఫ్ పట్ల ఆరాధనా భావాన్ని కనబరుస్తాడు. "ఆసిఫ్ వద్ద స్పీడ్, దూసుకుపోయే స్వభావం ఉంది. నేను అతన్ని చూసి షాట్ కొట్టే విధానాన్ని నేర్చుకున్నాను" అని పేర్కొన్నాడు. ప్రత్యర్థులను బోల్తా కొట్టించడంలో ఇరువురిదీ వన్నెవేసిన చేయి. ప్రత్యర్థి ఆసిఫ్ వద్దకు వెళ్ళగానే అతను బంతిని హకీంకు అందిస్తాడు. ప్రత్యర్థులను హకీం కొద్దిసేపు తనవైపుకు తిప్పుకొని అవకాశం చిక్కగానే బంతిని ఆసిఫ్‌కు ఇస్తాడు. వెంటనే ఆసిఫ్ గోల్‌పోస్ట్ వైపుకు దూసుకెళ్ళి అవసరమైన కార్యాన్ని సాధిస్తాడు. ఫైనల్లో కేరళకు గోల్డెన్ గోల్ లభించడం ఆసిఫ్ కనబర్చిన ఎత్తుగడ చలవే. అతను బంతిని తీసుకొని కుడివైపు వలయాకారంలో వెళ్తూ బంతిని దగ్గరలో ఉన్న గోల్‌పోస్ట్ వైపు బలంగా కిక్ చేశాడు. గోల్ కీపర్ బంతిని ఆపాడు. అయితే చురుకుగా వ్యవహరించిన హకీం బంతిని క్షణాల్లో మళ్ళీ నెట్‌లోకి నెట్టాడు.

ఆసిఫ్ సహీర్ చేసిన గోల్స్-6	హకీం చేసిన గోల్స్-7
తమిళనాడుపై సెమీఫైనల్లో 2 గోల్స్	గోవాపై ఫైనల్ మ్యాచ్‌లో 3 గోల్స్,
ఒరిస్సాపై క్వార్టర్ ఫైనల్లో 2 గోల్స్	తమిళనాడుపై సెమీఫైనల్లో 3 గోల్స్,
అస్సాంపై క్వార్టర్ ఫైనల్లో 2 గోల్స్	అస్సాంపై లీగ్ మ్యాచ్‌లో 1 గోల్

ఆసిఫ్, హకీంల స్టయిల్ వేరు అయినప్పటికీ అవసరమైన కార్యాన్ని నిశ్శబ్దంగా, చురుకుగా పూర్తిచేస్తారు. ఆసిఫ్ ప్రత్యర్థిపై విరుచుకు పడ్తాడు. మైదానంలో తెలివిగా వ్యవహరించి తల, ఓవర్ హెడ్ కిక్, రన్నింగ్ షాట్ ద్వారా గోల్స్ సాధిస్తాడు. హకీం సందులను వెతికి ముందుకు దూసుకెళ్తాడు. అతను డిఫెండర్లను, గోల్‌కీపర్‌ను బీట్ చేసి గోల్ చేస్తాడు. ఈ చతురతను ప్రదర్శించడం వల్లే ఫైనల్లో గోల్డెన్ గోల్ సాధించగలిగాడు.

గోల్డెన్ గోల్ లభించిన విధానం : గోవాతో జరిగిన ఫైనల్లో హకీం చేసిన గోల్డెన్ గోల్‌తోనే గోవాను కేరళ ఓడించి సంతోష్ ట్రోఫీని హస్తగతం చేసుకోగలిగింది. అదనపు సమయం రెండో అర్థభాగంలో మ్యాచ్ రసవత్తర దశకు చేరుకున్నప్పుడు ఆసిఫ్ తన ప్రత్యర్థులను తప్పించుకుంటూ బంతిని సహచరుడు హకీం వద్దకు చేర్చాడు. ఆ బంతి హకీం కాళ్ళ వద్ద పడింది. అతని సమీపంలో ఒక్క సహచర స్ట్రయికర్ కూడా లేదు. అయినా అతను కంగారు చెందకుండా బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి వేగంగా షాట్ కొట్టాడు. బంతి నెట్‌లోకి వెళ్ళకుండా ఇద్దరు డిఫెండర్లు ప్రయత్నిస్తున్నారు. వారినుండి బంతి తప్పించుకోగలిగితే గోల్ కాకుండా కాపాడడానికి ప్రత్యర్థి గోల్ కీపర్ కల్యాన్ చౌబె గోల్‌లైన్ వద్ద నిలబడి దృష్టినంతా బంతిపైనే పెట్టాడు. అయితే బంతి ఇద్దరు డిఫెండర్ల కాళ్ళ వద్ద పడడానికి బదులు వారిపైనుండి నెట్‌వైపుకు దూసుకెళ్ళింది. తన అంచనాలు తప్పడంతో గోల్‌కీపర్ కూడా కంగుతిన్నాడు. అప్పటికే సమయం మించిపోయింది.

కేరళకు గోల్డెన్ గోల్ లభించింది. "బంతి నావద్దకు రాగానే షాట్ కొట్టాను. తర్వాత ఏమైందో నాకు తెలియదు" అని హకీం ఉద్వేగంగా అన్నాడు. తన గోల్డెన్ గోల్‌తోనే కేరళ విజయం సాధించిందని తెలుసుకున్న తర్వాత హకీం ఉద్వేగానికి లోనయ్యాడు.

"సంతోష్ ట్రోఫీని కేరళ సాధించిన మధుర క్షణాలను నేను టెలివిజన్‌లో చాలాసార్లు తిలకించాను. నా స్వగ్రామమైన పాలక్కడ్‌లో చాలా కాలం క్రితం జరిగిన ఈ టోర్నీకి నేను బాల్ బాయ్‌గా వ్యవహరించాను. అయితే ఇప్పుడు నా గోల్ ద్వారానే కేరళ ఈ ట్రోఫీని గెలవడం నాకు చాలా ఆనందం కలిగించింది. నా కలలు దీంతో నిజమయ్యాయి" అని కళ్ళలో తన ఆనందాన్ని దాచుకోలేకపోయిన ఈ గోల్డెన్ బాయ్ అన్నాడు. "నేను విజయన్‌లాగా పేరు ప్రఖ్యాతులు సాధించాలనుకుంటున్నాను. అతను నా ఫేవరెట్ భారత ఫుట్‌బాల్ ఆటగాడు" అని సహీర్ పేర్కొన్నాడు. విజయన్‌ను ఆదర్శంగా తీసుకున్న హకీం, ఆసిఫ్ ఏ క్లబ్ తరఫున ఆడాలనుకున్నా ఒప్పందాన్ని సంయుక్తంగా కుదుర్చుకుంటారు. విజయన్ కూడా జోపాల్ అంచెరితో కలిసే ఏదైనా క్లబ్ తరఫున ఒప్పందం కుదుర్చుకునే వాడు. మోహన్‌బగాన్ నుండి జెసిటి, అక్కడినుండి ఎఫ్‌సి కొచ్చిన్, ఇప్పుడు ఈస్ట్ బెంగాల్‌కు మారడంలో హకీం, ఆసిఫ్‌లది ఒకే బాట, ఒకే మాటగా కొనసాగుతోంది. ★

కామన్‌వెల్త్

బి.ఎస్.రాములు



ఎల్లాకర్ విచిత్రమైన మనిషి. వాడు ఎపుడు దేన్ని విమర్శిస్తడో, దేన్ని ప్రశంసిస్తడో తెలువది. విమర్శించినపుడు యింతెత్తున గొంతెత్తి లొల్లి పెడుతడు. ప్రశంసించాలనుకుంటే లొల్లి పెట్టినంత అలుకగనే ప్రశంసిస్తడు. ఇంతకు ముందోసారి విమర్శిస్తివి గదా అంటే అది అప్పటికి కరెక్టు యిది ఇప్పుడు కరెక్టు అంటడు తప్ప తనది ఎన్నడూ తప్పని ఒప్పుకోడు. నరంలేని నాలుక ఎట్లైన మాట్లాడ్తవులే అని ఎవలన్న దెప్పితే "అంతామనమంచికేనె" అని నవ్వుతడు తప్ప వాదనల చిక్కడు దొరకడు. వాడు సగటు భారతీయుడు.

విజయలక్ష్మి భర్త చనిపోయి ఏడుస్తుంటే అంతా మంచికే జరిగింది అన్నడు ఎల్లాకర్. చావు పందిట్ల నాతోని అన్నడు గాబట్టి సరిపోయింది. ఎవరైనా వింటే గల్లావట్టి తరిమెటోల్లు. "ఛ నోర్మూయి నువ్వు మనిషి కాదుర" అన్న విసుగ్గ.

"రోజూ తప్పతాగి కొట్టే భర్త ఆక్సిడెంటులో పోవడం మంచి కాకుండ చెడు ఎట్ల అయితది" అని చావు పందిట్లో ఎల్లాకర్ గుసగుసగా నాతో వాదనకు దిగడం ఆశ్చర్యమనిపించింది. వీడు నిన్నటిదాకా అందర్ని అదరకొట్టుకుంట విజయలక్ష్మి భర్త పోషేందర్‌ను సమర్ధించిన బాపతు.

"పోషేందర్‌కు ఏవో చెప్పలేని బాధలురా! ఎవరూ తన బతుకును, ఆరోగ్యాన్ని పాడు జేసుకోవాలనుకోరు, తన పైసలే పాయె తన పరువూ, ఆరోగ్యమే పాయే. తనకు తానే శిక్ష వేసుకునె, విమర్శించి మనం దూరం గొడ్తె ఒకే తప్పుకు రెండు శిక్షలు వేసినట్టయితది. ఇంకింత తాగుబోతైతడు. వాని మీద జాలి చూపాలెరా కోపం కాదు. అదే మానవత్వం" అని వాదించిండు ఎల్లాకర్. అదేమాట యాది జేసిన.

"అప్పుడది వాని తరపున కరెక్టు. ఇపుడు విజయలక్ష్మి వైపు నుంచి కరెక్టు. అరె వెంకులూ! కాస్త నిదానంగా, నిజాయితీగా, నిర్భీతిగా ఆలోచించుర. ఇపుడు పోయినోని గురించి ఆలోచించుడు కాదు. ఉన్నోల్ల గురించి ఆలోచించు. ఆ తాగుబోతు వెధవతో విజయలక్ష్మి ఎన్నడైన సుఖపడిందంటవ? ఇపుడా బాధలన్ని తీరినై. వాని ఉద్యోగం ఆమెకిస్తరు. పెన్షను, గ్రాట్యూవిటి కూడా వస్తది. సోషల్ లైఫ్ పెరుగుతది. మునిపటికన్నా ఈ జీవితమే ఆమెకు బంగారు జీవితం. పిల్లల్ని చదివించి పెద్దజేయవచ్చు" నా మీద వానికి హక్కుందని అందరికి తెలువాలని వెంకటేశ్వర్ అనకుంట నన్ను వాడు వెంకులూ అని పిలుస్తుంటడు.

మాటల్లోనే శవం ఊరేగింపు బయల్దేరింది. ఏడ్పులు మిన్నుముట్టినై. చెరోపక్క జేరి పాడె మోసినం కొంతసేపు. దహనక్రియల్ని దగ్గరుండి జరిపించిండు ఎల్లాకర్.

చనిపోయిన మూడోరోజు పక్షికి పెట్టుడు. దగ్గరి వాల్లను పిలిసిన్రు. కాలేసిన శ్మశానం పక్కనే చెట్లల్లో బోయినాలు. ఆపని ఈ పని పురమాయించుకుంట ఎల్లాకర్ మల్ల అదే చర్చ మొదలు పెట్టిండు. విజయలక్ష్మిని ఏడుస్తుంటే మా శారద ఊకుంచి నా పక్కన ఏదో చెప్తామని చేరింది. మా శారదనే అడిగింది.

"మీరన్నది నిజమే అన్నయ్యా! కాని ఎంతైనా భర్తలేని లోటు తీర్చగలిగేది కాదు గదా! తల్లిగారైన గట్టిగుండాలె. భర్తన్న ఉండాలంటరు. అన్ని సుకాలుండి ఏం లాభం భర్త పోయినంక."

అట్లా అడుగుతున్నపుడు మా ఆవిడ ముఖం ఏదో తేజస్సుతో వెలిగిపోతున్నది. ఎవరో పిలిచేసరికి మా శారద అక్కన్నుంచి కదిలింది. నా మిసెస్ గట్లడిగే సరికి నా గుండె గతుక్కుమన్నది. అకస్మాత్తుగా డౌటొచ్చింది.

"అరె ఎల్లాకర్! ఈ ఆడోల్లంత మొగుడు పోతేనే ఎక్కువ సుఖం అనుకుంటరా ఏంది? మా శారద "భర్తలేని భార్య ఉత్తమురాలు ఓయమ్మా! ఓయమ్మా!" అని పాటమార్చి పాడుతున్నట్టు ఆ ముహంలో అంత వెలుగేంటిదిరా?"

"నీ తలకాయ! శారద ముహంల ఉన్న కళ, వెలుగు నువ్వేరా! నా మొగుడు నాకున్నడు అని తృప్తి, ఆత్మ విశ్వాసంతో ఆమె ముహం వెలిగిపోతుంటే ఇలా పెడర్థాలు తీయాలని నీకెట్ల బుద్ధి పుట్టిందిరా" అని నోరు మూయించిండు ఎల్లాకర్.

మల్ల కొంచెం సేపటికి శారద మా దగ్గరికచ్చింది. ఎల్లాకర్ మల్ల మొదలు పెట్టిండు. "శారదా! ఈ కాలంలో భర్త లేకపోవడం అనేది మునుపటి తీర్గ పెద్ద లోపం కాదు. అన్ని కావాలెగని భర్తలు మాత్రం వద్దని ఫెమినిస్టులు ఉద్యమాలు చేస్తున్న కాలం ఇది. అంతగా అవసరమనిపిస్తే భార్య కోల్పోయినోన్నో, యువకున్నో చేరదీసి గుట్టురట్టు కాకుండా ఎంతమంది సంసారం జేస్తలేరు. లోకం గూడ చూసి సూడనట్టుంటది. సమాజంల ఇపుడా సంస్కారం వచ్చేసింది. మీ లలిత చిన్నమ్మను ఇపుడు ఎవరైన వేలెత్తి చూపుతున్నరా చెప్పు. సిద్ధాంతం, రాద్ధాంతం చేయకుంటె ఎట్లయిన బతకచ్చు. "శుక్రనీతి" అని ఒకటున్నది. ప్రపంచంల చట్టాలు నీతులు, విలువలు ఎన్నో తయారు జేస్తరు. దానికి కొన్ని మినహాయింపులిస్తరు. ఈ మినహాయింపులకు కూడా కొన్ని నైతిక విలువలు, సందర్భాలుంటయి. ప్రపంచంల ఎందరు ఎన్ని జెప్పినా చివరకు శుక్రనీతినే ఆచరిస్తరు. ఆ మాట ఓసారి ఒప్పుకుంటరు. ఓసారి ఒప్పుకోరు. గంతే" అన్నడు ఎల్లాకర్.

ఎల్లాకర్‌కు ఉదాహరణల కొరత లేదు. మా శారద వాళ్ల చిన్నమ్మను ఓసారి గొల్లెం బెట్టి రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నరు. "మా యిష్టం తోటి కల్సి ఉంటున్నం. మీరెవలు, మీరు మీ పెండ్లాల దగ్గర, మొగల్ల దగ్గర పంటలేరా! నేను గూడ మీ తీర్గనే బతుకుతున్న. మీ తీర్గనే సిన్మాలు జూస్తున్న. అని లలిత లొల్లి పెట్టింది. రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నది గూడ నయమే అయిందిర. ఇపుడామె బాజాప్తగ అతన్తోని కల్సి ఉంటున్నది అన్నడోసారి ఎల్లాకర్.

ఇట్లా అక్రమ సంబంధాలను "శుక్రనీతి" అనుకుంట అవేవో పవిత్ర సంబంధాలన్నట్టు ఎల్లాకర్ మా శారదకు ఊరించి చెప్తుంటే నాకు ఒళ్ళు మండింది. మా శారద యిష్టం లేనట్టు నటిస్తూనే ఆసక్తిగా వింటున్నది.

పక్షికి పెట్టే కార్యక్రమం కొంచెం తక్కువ వనబోయినాల తీర్గైపోయినై. పోషెందర్ పోయిండనే బాధ ఎక్కడా కనపడలేదు.

పదకొండో రోజునాడు విజయలక్ష్మి బొట్టు, గాజులు, మట్టెలు పగలగొట్టి తెల్లచీర కట్టిస్తుంటే మా శారద మరో యిద్దర్ని వెంటేసుకుని అది దుర్మార్గం అన్నది. బొట్టు మొగునితోని రాలేదు. చీరెలు మొగనితోని రాలేదన్నది. మంగళసూత్రం మట్టెలు తీసెస్తె తీసెయిన్రి అని వాదనకు దిగింది. నువ్వన్న చెప్పు అన్నయ్య అని ఎల్లాకర్‌ను మద్దతు రమ్మన్నది శారద.

ఎల్లాకర్ విచిత్రంగా వాదించడం ఆశ్చర్యమనిపించింది. విధవను చేసే కార్యక్రమం నిజంగా

భయంకరమైనది. అది అందరు అంగీకరిస్తరు. ఎల్లాకర్ మరో రూట్లో వచ్చిండు.

"శారదా! పోనీతియ్యి! ఆ పాత జ్ఞాపకాల్ని అలా పగలగొట్టడమే మంచిది. గతం తాలూకు, భర్త తాలూకు గత చిహ్నాలేవీ లేకుండా ఉంటేనే ఆమె తొందరగా కోలుకుంటది. కొత్త జీవితం గెలుచుకుంటది. ఆ బంధాలన్ని తొలిగితే ఆమెకే మంచిది" అని వాదించిండు ఎల్లాకర్.

ఎల్లాకర్ వాదన వింటే ఎంత ఛాందసుడైనా బొట్టు గాజులు, పుస్తెలు పగలగొట్టాలని మాత్రం కోరుకోరు. అదే ఎల్లాకర్ రివర్స్‌గేర్ తర్కం ప్రత్యేకత. ఎల్లాకర్ వాదన విని మా శారద అర్థాంగీకారంతో మౌనంగా ఉండిపోయింది.

ఏడాది గడిచిపోయింది. విజయలక్ష్మి కొద్ది నెలల్లోనే కోలుకున్నది. ఉద్యోగంలో చేరి తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇపుడామె బొట్టు, గాజులు పెట్టుకుంటున్నది. తనకు నచ్చిన చీరలు కట్టుకుంటున్నది. విజయలక్ష్మి ఎల్లాకర్‌తో స్వచ్ఛంగా నవ్వుతూ మాట్లాడుతుంటే నాకు అనుమానం. ఎంత దగ్గరి వాల్లయినా కొన్ని అడగలేము. చర్చించలేం.

ఓ రోజు వాడే ఆ ప్రస్తావన తెచ్చిండు. "అరె వెంకులూ! భర్త ఆస్తిపాస్తులు పొందిన భార్య మళ్ళీ పెళ్ళిచేసుకోవద్దు అని రూల్సు రాసినోడెవడో పెద్ద శాడిస్టురా! పిల్లలకు మంచి భవిష్యత్తుకోసం తండ్రి ఉన్నాడనే ఆత్మవిశ్వాసంతో పెరగడానికైన మళ్ళీ పెళ్ళి అవసరం గదా! మొదటి భర్తకు పుట్టిన పిల్లలు, మొదటి భర్త వంశం కూడా ఎంతో ఉన్నతంగా నిలబెట్టి నట్టవుతుంది. మన ఎనుకటోల్ల బుర్రలన్నీ స్వార్థంతో కూడుకున్న మట్టి బుర్రలురా! తన వంశమే నిలవద్దదని తెలియక మల్ల పెండ్లి చేసుకోవద్దనుడు అమాయకత్వమో, మూర్ఖత్వమో కాదంటవా!".

ఎల్లాకర్ అన్నదాన్లో నిజం లేకపోలేదు. మా శారద చిన్నమ్మ పిల్లలిపుడు వెంకటనారాయణను బాబాయి, బాబాయి అని పిలుస్తున్నరు. నాన్న అని పిలవడం లేదనేది తప్ప అతను ఎప్పుడు ఆ పిల్లలను వేరే తీరు చూడలేదు. పిల్లలు గూడ అతన్ని కన్న తండ్రి కన్నా వేరుగా చూడలేదు. ఈ మధ్యనే పెద్దమ్మాయి పెళ్ళి చేసిన్రు. లలిత, వెంకటనారాయణలే కాళ్ళు కడిగిన్రు. పెళ్లి చేసిన్రు. ఎవరూ పెద్దగా అభ్యంతరం చెప్పలే. అభ్యంతరం చెప్పెటోల్లు ఆ పెండ్లికే రాలే. మా శారద చిన్నమ్మ పెద్ద కొడుక్కు పేమెంటు కట్టి బిఇడిలో చేర్పించిండు వెంకటనారాయణ. ఇంట్ల కొద్ది గంత గడబిడ అయిందిగని మీకు మాత్రం ఏం తక్కువ జేసిన అని వెంకటనారాయణ సముదాయించేసరికి మల్ల ఎవరూ ఎదురు చెప్పలేదు. ఎల్లాకర్ ఇపుడు వెంకటనారాయణ రూట్లో పడ్డడా అని డౌటొచ్చింది. ఓ రోజు వాడే తీర్చిండు.

"అరే వెంకులూ! ఇపుడో చిక్కుచ్చిపడ్డదిరా!" అంటూ కథంతా వివరించిండు. అయితే ఆ కథలో హీరో ఎల్లాకర్ కాదు. అతడు పెండ్లి పెద్ద.

"మొన్న విజయలక్ష్మి చాలాసేపు మాట్లాడింది. రాజేశ్వర్ గురించి నీ అభిప్రాయం ఏమిటి! రాజేశ్వర్ గూడ నిన్నే అడుగుమన్నడు అన్నది. ఇట్ల అడిగిన్రంటే మేం కల్సి జీవించడానికి మీరు అంగీకరించున్రి అని కోరుడు తప్ప ఇన్ల మనం చేసేదేమున్నదిరా! రేపు ఏదైనా మీరే మా పెద్దలుగా తోడుండి పరిష్కరించాలని చెప్పినట్టిది" అంటూ ఆగి మా శారదకేసి చూసిండు ఎల్లాకర్.

ఆ రాజేశ్వర్ ఎవరో కాదు. మా శారద తమ్ముడే. మా బామ్మర్ది. పెండ్లయిన నాలుగేండ్లు నిండకుండనే పొరపొచ్చాలొచ్చినై. యాడాది నుంచి కోర్టులో విడాకుల కేసు నడుస్తాంది. ఇట్ల విజయలక్ష్మికీ, రాజేశ్వర్‌కూ లీగల్‌గా ఆమోదముద్ర లేని పెండ్లి అపసరం.

"నువ్వేమన్నవురా" వాని వాదన రెండు వైపుల పదునున్న కత్తి అని తెల్సి ముందే అడిగిన. వాడు నాకన్న రెండాకులు ఎక్కువ చదివిండు. నాకు చిక్కలేదు.

"నిన్నూ, శారదను తెల్సుకోకుంట ఏ సంగతీ చెప్పలేను అని అన్న"

వారం పది రోజుల తర్జన భర్జనలు జరిగినై. అన్ని తీర్ల ఆలోచించి వాడూ, నేనూ, మా శారద ఒక నిర్ణయానికచ్చినం.

రాజేశ్వర్, విజయలక్ష్మి కల్సి ఓ రోజు దగ్గరి వాళ్లనుకున్న ఏడెనిమిది ఫ్యామిలీలను బోయినానికి పిల్సిన్రు. మేం గూడ వాల్లను బోయినానికి పిల్సి చీరె, డ్రెస్సు కూడా పెట్టినం. ఇద్దరు కల్సి మంచిగనే బతుకుతున్నరు.

కొంతకాలమైనంక రాజేశ్వర్ మీద ఉరుములేని పిడుగు తీరు విరుచుకుపడ్డడు ఎల్లాకర్. విజయలక్ష్మి, నేను, మా శారద అందరం ఎవర్ని సమర్థించాల్నో తెల్సుకోలేకపోయినం.

"గ్లోబలైజేషన్, అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు శత్రువు అని కొందరు ఊదరగొడ్తున్నరు. అంతర్గత వైరుధ్యాల నుంచి దృష్టి మల్లించడం కోసం పాలకవర్గాల్లోంచి ఒక సెక్షన్ పని గట్టుకొని ఈ ప్రచారం చేస్తున్నది. వాల్ల నోరు పెద్దది. అదే నోరు తోటి భారతదేశ ప్రజలకు కుల వ్యవస్థ కులాంతరాలు, అంతర్గత ప్రథమ శత్రువు అగ్రరాజ్యంగా ఎదగకపోవడానికి కులమే ప్రధాన అడ్డంకి అని వీల్లెందుకంటలేరో ఎరుకేనా? వాల్లంతా కుల వ్యవస్థ వల్ల అన్ని రకాలుగా లాభపడేటోల్లేగాబట్టి" అని అన్నాడు ఎల్లాకర్.

ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్, ప్రపంచ బ్యాంకు, గాట్ వీటన్నిటిని ఎందుకు వ్యతిరేకించాలో ఇన్ని రోజులు ఊదరగొట్టిన ఎల్లాకర్ యిట్ల ప్లేటు ఫిరాయిస్తే మాకేం సమజ్ కాలేదు. అతని వాదన అతనికే విన్పించినం.

"ఒరే వెంకులూ! చరిత్రను అధ్యయనం చేసెటోల్లు ఒక విషయం అంగీకరిస్తరు. మన దేశంల ఏమార్పైనా విదేశీయుల రాకపోకలు లేకుంట రాలేదు. నాటి ఆర్యులు, మొన్నటి ముస్లింలు, నిన్నటి యూరోపియన్లు, వీల్ల రాకవల్లనే నిలకడగా ఉన్న వ్యవస్థలు కదలబారినై. కుల వ్యవస్థలో మార్పులచ్చినై. అంతెందుకు? మన దేశంలో వచ్చిన కబీరు, గురునానక్, రామానంద, రామానుజ, చైతన్య, గురు రవిదాసు, తుకారాం భక్తి ఉద్యమాలు గూడ ఇస్లాం ప్రభావం వల్లనే తమ మతాన్ని తాము సంస్కరించుకునుటానికి వచ్చినయేగద. రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం సంస్కరణలు బ్రిటీషోల్లు పరిపాలనలో లేకుంటే సాధ్యమయ్యేటియేనా?" అని ఎల్లాకర్ అడిగితే ఏం చెప్పలేక... ఇంకా చెప్తడో అని ఊ కొట్టిన.

"ఇగో శారదా! ఈ దేశంలో ఆధునిక విద్య, వైద్యం, పరిశ్రమలు యూరోపియన్ల వలస వల్లనే అభివృద్ధి చెందినై. వాల్ల ప్రభావంతోనే మన హిందూ సమాజంలో సంఘ సంస్కరణలు మొదలైనై. వాల్ల ప్రభావం, వాల్ల పరిపాలన ఉండుట్లనే అందరికి సమాన హక్కులు. ఇంతమంచి రాజ్యాంగం సాధ్యమైనై. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లచ్చినై. అదే దోపిడి కులాలోల్లు పరిపాలనలో ఉంటే యివేవీ సాధ్యమయ్యేటివా! బీసీలకు యాభయి ఏండ్లయినా రాజకీయ రిజర్వేషన్లు యిస్తలేరు గద. ఇది జాలదా మనోల్లు అవతలోడు లేకపోతే ఎంత కరుడుగట్టుకపోతరో చెప్పుటానికి. అందువల్ల సమాజాన్ని మళ్ళీ కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, వేదకాలంలాగా వెనుకకు నడిపిస్తున్న హిందూ వాదులకు విరుగుడు పరిష్కారం విదేశీ సంపర్కంలోనే ఉంది. గ్లోబలైజేషన్లోనే ఉంది. పైగా దీన్ని అడ్డగించడం ప్రపంచంలో ఏ దేశానికీ సాధ్యం కాదు. సాధ్యం కాన్ది పట్టుకొని వల్లించుకుంట. వ్యతిరేకించుకుంట కూర్చునే బదులు, జరగగలదాన్ని ఊహించి అందులో ముందుండి నడవడం తెలివి గలోల్లు చేయాల్సిన పని. హిందుత్వ వాదులే వాళ్ల అవసరాల కోసం గ్లోబలైజేషన్ను ఆహ్వానిస్తుంటే నువ్వునేను వద్దనుడెందుకు చెప్పు?"

"అరె ఎల్లాకర్.... ఈ దేశంలో వృత్తి ఉపాధి అవకాశాలు కోల్పోయి పేదోల్లకు తిండికి లేకుంట గాదా! వాల్లందరు ఎట్ల బతుకాలే?" అని అడిగిన.

"ఆఁ! ఇపుడు పేదోల్లు నుంచిగ బతుకుతున్నరనుకుంటన్నవా? అరవై శాతం జనాభా దారిద్ర్యాన్ని తలకెత్తుకొని బతుకున్నరని ప్రభుత్వమే చెప్తున్నది. వాల్లకున్నది బుడ్డగోచి. బుడ్డగోచి కన్న పేదరికం యింకేమున్నది. మహా అయితే యింత బుడ్డగోచి ఊడపీక్కుంటరు. అంతేగదా! అయితే "సామ్రాజ్యవాద సంక్షేమ అర్థశాస్త్రం" ఏం చెప్తున్నదో ఎరికేనా? బుడ్డగోచి గూడ లేకుంటైతె అమెరికోడు ఏమమ్ముకుంటడు. మనోల్ల కొనుగోలు శక్తి పెరుగుతనే వానికి లాభం, వాని సరుకుల పేర్లు సదువుటానికన్న సదువు రావాలే అని ప్రత్యేకంగా అందరికి సదువు రావాలని గ్రాంట్లు ఇస్తున్నట్టే అందరు తినగలిగేటట్టు గూడ ఏదో చేయక తప్పది. మధ్య మునిగేది మధ్య తరగతి సుఖాలు, ఈ దేశ చిన్న పెద్ద పారిశ్రామికవేత్తలు, అందుకే గవాల్లే ఇంత లొల్లి చేస్తున్నరు. వాళ్ల సుఖాల కోసం పేదోల్లు మరింత పేదోల్లయితరని బూచి చూపిస్తున్నరు" అన్నాడు ఎల్లాకర్.

"బావా! ఎల్లాకర్ వాదన దుర్మార్గం. ఈ దేశాన్ని అమ్మేటోల్లను సమర్థిస్తున్నడు" రాజేశ్వర్ తన వాదన విన్పించిండు. ఇదిగూడ రాజేశ్వర్ సొంతవాదన కాదు. ఎల్లాకరే ఎప్పుడో నూరి పోసింది. ఆయనకే అప్పగించిండు.

"బీసీలకు అన్ని రంగాల్లో రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ, ఎస్టీల తీరు పూర్తి స్థాయిలో రాజకీయ రిజర్వేషన్లీయకుండ కులం ఈ దేశంలో అంతర్గత ప్రథమ శత్రువు అని ప్రకటించి కుల వివక్షను పరిష్కరించకుండ గ్లోబలైజేషన్ ఒక్కటే మాట్లాడే ప్రతి ఒక్కడు నా దృష్టిలో దేశద్రోహి. ఎందుకంటే యిది మెజారిటీ ప్రజల సమస్య. దేశమంటే మెజారిటీ ప్రజలే గనుక. ఈ దేశాన్ని అమ్ముతున్నది అగ్రకుల పాలకవర్గాలే. వాల్లను ముందుగల్ల గద్దె దించాలని చెప్పకుండ, పోరాడకుండ ఏం మాట్లాడిన దేశద్రోహం కన్న పాపం."

"ఇంకా కులం ఎక్కడున్నదన్నయ్యా!" అన్నది విజయలక్ష్మి తాను రాజేశ్వర్‌తో చేస్తున్న సంసారం కులాంతరమే. మాకీకులం అడ్డం కాలేదని ఆమె ఉద్దేశం.

ఎల్లాకర్‌ను మెప్పించి ఒప్పించడం ఎవరితరం?

'గెయిల్ ఓంవెద్' అనే అమెరికన్ రచయిత్రి ఇండియాలో స్థిరపడ్డది. ఆమె ఈవిషయం గురించి ఆరేడేండ్ల నుంచి ఎన్నో వ్యాసాలు రాసింది. మొన్ననే నాకొకాయనిచ్చిండు. జిరాక్సు చేసుకొని మీరు గూడ సదువున్రి" అని ఉచిత సలహా పారేసిండు ఎల్లాకర్. మేం చదువుటంటేనే నిద్రస్తందనే బాపతని వానికి తెల్సు. రాజేశ్వర్ అప్పట్నుంచి ఎల్లాకర్‌తోని మాట బందు జేసిండు. ఎల్లాకర్ బాగ బాధపడ్డడు. గింత దానికి చేసిన మేలు మర్చి మాటలు బందు చేయల్నా అని.

తర్వాత కొంత కాలానికి రాజేశ్వర్‌కు కోర్టు ద్వారా విడాకులు మంజూరైనై.

(మిగతా వచ్చేవారం)

నిత్య చైతన్యశీలి - నివురుగప్పని నిప్పు

ఎం.హెచ్. సంస్మరణ

నిత్య చైతన్యశీలి, నివురుగప్పని నిప్పు వంటివాడు. మండే కొలిమి, తిరిగే సారె, మరిగే లోహం, ఎగిరే పక్షి వంటివాడు. రైలు గమనాన్ని సకాలంలో సరైన వైపు మళ్లించే రైల్ కట్టర్ వంటివాడు. రచయిత, సంపాదకుడు, వక్త, వ్యూహకర్త, ప్రజా రాజకీయ రణక్షేత్రంలో అలుపెరుగని యోధాగ్రేసరుడు మోటూరు హనుమంతరావు అస్తమయంతో ఉవ్వెత్తున లేచిన కెరటం ఉన్నపళంగా స్తంభించిపోయినట్టు, ఒక మహా ప్రవాహం గడ్డకట్టిపోయినట్టు, జలపాతం ఘనీభవించినట్టు అనిపించింది. కార్యక్షేత్రాన్నే జీవన క్షేత్రంగా చేసుకుని ప్రజలకోసం పాటుపడిన కొద్దిమంది కమిటెడ్ నాయకులలో హనుమంతరావు ఒకరు.



ఉద్యమ నిర్మాత - ఉత్తేజ ప్రదాత
కామ్రేడ్ మోటూరు హనుమంతరావు
సంకలనం : తెలకపల్లి రవి; వెల : రూ. 15;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

బయట పాలకవర్గాలతో, యాజమాన్య వర్గాలతో కష్టజీవుల తరపున పోరాడడంతోపాటు ఇటు ఇతర పార్టీల బాణాలకు ప్రతిగా శరసంధానం చేస్తూ ఏకకాలంలో రెండువైపులా కాచుకోవడం భారత కమ్యూనిస్టు నాయకులు ఎదుర్కొనే విచిత్ర పరిస్థితి. ఈ ఉభయ సాములోనూ మోటూరు కాకలు తీరారు. అటువంటి ప్రజా రాజకీయ, సాహిత్య ప్రభంజనం, జనం ధనం అయిన మోటూరు హనుమంత రావుగారి గురించి ఆయన సహచర నాయకులు, ఆయనతో పనిచేసిన సంపాదకులు, ఇతర రచయితలు, కామ్రేడ్లు, ఆత్మీయులు వ్రాసిన ఆయనతోటి జ్ఞాపకాల దొంతరను అనతికాలంలో ప్రచురించిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు, సంకలన కర్త తెలకపల్లి రవిగారు అభినందనీయులు.

"తెలంగాణా పోరాట సందర్భంగా పలువురు కామ్రేడ్లు వివిధ రకాల బాధ్యతలు నిర్వహించారు. కొందరు పోరాట రంగంలో ప్రత్యక్షంగా దుమికి సారథ్యం వహించగా, మరికొందరు ఈ పోరాటానికి అవసరమైన వనరులను సమకూర్చడం వంటి బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో పత్రిక సంపాదక బాధ్యతలు కామ్రేడ్ మోటూరు హనుమంతరావుకు విడిచిపెట్టడం జరిగింది. పదేళ్ళ సుదీర్ఘ అంతర్గత పోరాటం అనంతరం పార్టీలో చీలిక అనివార్యమైనప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పుచ్చలపల్లి సుందరయ్య, ఎం.బి., ప్రసాదరావు, ఎం.హెచ్. వంటి మెజారిటీ నాయకులు ఈ పోరాటంలో ముందు పీఠిన నిలిచారు అంటూ హనుమంతరావుగారి గురించి హరికిషన్ సింగ్ సూర్జిత్ వ్రాసిన వాక్యాలు రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమంలో, సి.పి.ఎం. పార్టీ నిర్మాణంలో ఎం.హెచ్.కున్న విశిష్ట స్థానాన్ని అతిశయోక్తులకు ఆస్కారంలేకుండా వివరిస్తున్నాయి. మరో సీనియర్ నాయకుడు, ఆయన సహయోధుడు లావు బాలగంగాధరరావు ఇలా అంటున్నారు. "కృశ్చేవ్ రివిజనిజాన్ని ఎండగట్టడంతో మొదలు పెట్టి గోర్బచేవ్ విద్రోహాన్ని చీల్చి చెండాడడం వరకు అన్ని దశలలోనూ ఆయన సైద్ధాంతిక విషయాలలో చాలా కరుగ్గా, పదునుగా ఉండేవాడు. వ్యక్తిగతంగా చాలా సౌమ్యుడైనా రాజకీయ నిర్మాణ సమస్యలలో రాజీపడేవాడు కాదు.

"పాతతరం అంతరించిపోయే సమయం ఆసన్నమైంది. నవనవోన్మేషమైన నూతన తరం పెరుగుతోంది. ఇందుకు ఎం.హెచ్. కృషి అపారం... ఆ పదునైన భాష రాజకీయ విజ్ఞత అనితరసాధ్యం." మోటూరును మరో కోణంలో విశ్లేషించి చెప్పిన ఈ పలుకులు ఆయనతో సన్నిహితంగా కలిసి నడిచిన నండూరి ప్రసాదరావు గారివి.

మోటూరుతో తన సాహచర్యం, ఆయనతో కలిసి ఎర్రజెండా ఎత్తిపట్టుకుని తాము సాగించిన సుదీర్ఘ పోరాట యానం గురించి కొరటాల సత్యనారాయణగారు సవివరంగా వ్రాసిన వ్యాసంలో ఆత్మీయ స్పర్శ తొణికిసలాడింది.

"ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఆయనది దశాబ్దాలపాటు సాగిన అమోఘమైన గాథ. వెరపులేని మరపురాని చరిత్రతో పెనవేసుకుని, కఠిన కారాగారాల్లో అంధకార అజ్ఞాతాలతో సమర రంగంలో ఘర్షణలతో, దాడులతో, విచ్ఛిన్నాలతో నిరంతరం పోరాడిన వీరయోధుని, నాయకుని అమరగాథ మన కామ్రేడ్ ఎం. హెచ్. జీవనయాన గాథ" అని మల్లు వెంకట నరసింహారెడ్డి ఏకబిగిన చెప్పినది ప్రత్యక్షర సత్యం. ఎం. హెచ్. అనుంగు సహచరుడు, సీనియర్ సంపాదకుడు వి. ఆర్. బొమ్మారెడ్డి ఆయనతో తన జ్ఞాపకాలను గురించి సాకల్యంగా వివరించారు. ఓ విప్లవ శంఖం మూగవోయిందంటూ ప్రజాశక్తి ప్రస్తుత సంపాదకుడు వి. శ్రీనివాసరావుగారు తన హృదయ వేదనను వెలిబుచ్చారు.

ఈ గ్రంథంలో మణిపూసవంటి ఆత్మావిష్కరణ డాక్టర్ మోటూరు ఉష తన తండ్రిని గురించి చెక్కిన అక్షర నక్షత్రాలు. ఆమె కాసేపు తన బాల్యంలోకి వెళ్ళి పది, పన్నెండేళ్ళ బడి బాలికగా మారిపోయి నాన్నను గురించి ఎంతో ఆర్ద్రంగా వివరించారు. నాన్నగారి జనప్రీతి, మిత్ర ప్రీతి తమ రొటీన్ నుంచి, తమ వృత్తి పరిమితులనుంచి తమ ఏకాగ్రతను మళ్ళించి తాత్కాలికంగా అసౌకర్యానికి గురిచేసిన సందర్భాలను కూడా వివరించి ఆమె ఆదర్శవంతమైన వొరవడిని పాటించారు. "అబ్బ ఈ నాన్న కరుడుగట్టిన కామ్రేడ్, లివింగ్ ఫాసిల్ (శిలాజం) - మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోరే అని కూడా అనిపించేది." అని ఉషగారు నాన్నగారిని గురించి విసుక్కుంటూ తాము అనుకున్న మాటలను చెప్పి ఆయన ఔన్నత్యాన్ని వివరించిన తీరు బాగుంది.

సీనియర్ పాత్రికేయుడు తెలకపల్లి రవి, హనుమంతరావుగారితో తన సాన్నిహిత్యం నుంచి లభించిన ఆయన కలంలోని సాహిత్య పరిమళాన్ని అద్ది ముచ్చటైన వ్యాసం వ్రాశారు. ఎం. హెచ్. వ్రాతలోని బిగువును గురించి, నైశిత్యాన్ని గురించి వివరించారు. ఆయన వాడిన సామెతలు, నుడులు, నానుడులను ఉదాహరించి ఎం. హెచ్. అక్షరమూర్తిని ఆవిష్కరించారు. ఎస్. వెంకటరావుగారు ఎం. హెచ్.కు అక్షరాంజలి ఘటించారు. సాధారణ రాజకీయ సంపాదకుడిని గురించి వార్త దినపత్రిక సంపాదకీయం వ్రాయడమే ఎం. హెచ్. ప్రత్యేకతను తెలియజేస్తుంది. అయితే పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో లాగ ప్రబలమైన శక్తిగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో వైఫల్యం గురించినదని ప్రస్తావన చర్చించదగినది. సీనియర్ పాత్రికేయుడు వాసిరెడ్డి సత్యనారాయణగారు ఎం. హెచ్.తో తన సాన్నిహిత్యాన్ని, ఆయన ఆప్యాయత, ఆత్మీయతల అవిస్మరణీయతను వివరించారు. రచయిత వి. చంద్రశేఖర అజాద్ తన నేపథ్యం వేరంటూ మావయ్య, తాను పుట్టిన వెల్లటూరు బంధాన్ని చక్కగా వివరించారు. ఎం. హెచ్. ప్రతిభావ్యుత్పత్తులను గానం చేసిన ఏడు పాటలూ బాగున్నాయి.

అధికారంలోకి రావడమే లేదా కొనసాగడమే కమ్యూనిజం అస్తిత్వానికి, విజయానికి నిదర్శనాలుగా తీసుకోవడం సరికాదేమో. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడంతోనే పరిపూర్ణమైన సోషలిస్టు సమాజాలు అవతరించినట్టూ, అందులో అవి విజయం సాధించినట్టూ కాదు. అది నిరంతర ప్రక్రియ. అనునిత్యం మారుతూ వుండే ప్రపంచంలో ఎప్పటికప్పుడు ప్రజలను పట్టి పల్లార్చే ప్రభువర్గ, దోపిడీవర్గ విధానాలకు, కుయుక్తులకు వ్యతిరేకంగా జనచైతన్యాన్ని రగిలిస్తూ పోయినంతకాలం ఏ పార్టీ అయినా, ఏ ఉద్యమమైనా, ఏ నాయకులైనా విజయపథంలో పురోగమిస్తున్నట్టే. ఏకధ్రువ ప్రపంచం అవతరణతో అమెరికా సామ్రాజ్యవాదం పలు కోరలతో, కొమ్ములతో, ఉక్కు డెక్కలతో ప్రపంచ మానవాళి సర్వ హక్కులను మరింతగా కాలరాస్తూ వికటాట్టహాసం చేస్తున్న వర్తమానం, దాని మెప్పుకోసం మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానా విధాలైన పాట్లుపడుతూ ప్రజావ్యతిరేక విధానాలకు దుస్సాహసిస్తూ ఉన్న వికృత స్థితి కమ్యూనిజంపై, కమ్యూనిస్టులపై బాధ్యతను పెంచి వారి ఉనికిని ఉజ్వలోజ్వలం చేస్తున్నది.

మోటూరు సమగ్ర చిత్రాన్ని అక్షరావిష్కరణ చేయడంలో ఈ గ్రంథం సఫలీకృతమైంది. అయితే మరో గొప్ప వ్యక్తి వ్యాసం ఇందులో లేకపోవడం బాధగా వుంది. పరిస్థితుల ప్రభావం వల్ల దీర్ఘకాలంగా మంచం పట్టి ఉండడం వల్ల ఆ 'ఉదయ' రేఖలను ఈ పుస్తకం అందుకోలేకపోయిందనుకోవాలి. సూర్యుడికి పట్టిన దివిటీలు కాదు. ఆయననుంచి పుణికి పుచ్చుకున్న వెలుగును ఆయన పరోక్షంలో ప్రసరిస్తున్న దేదీప్యమానమైన దీపాలు ఈ పుస్తకంలోని వ్యాసాలు.

- జి. శ్రీరామమూర్తి

అంపశయ్య నవీన్

రోడ్డు దాటటం....

"ఏమండీ రచయితగారూ! ఎక్కడికో వెళ్ళొస్తున్నట్టున్నారు. ఏమిటి విశేషం" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు అప్పుడే ఆటో దిగి ఇంట్లోకొస్తున్న నన్ను చూసి.

"నా క్లోజ్ ఫ్రెండ్ ఒకతనికి పెద్ద యాక్సిడెంటయిందండి. హాస్పిటల్లో జాయిన్ చేశారు. అతన్ని చూసొస్తున్నాను" అంటూ ఇంట్లోకొస్తున్న నన్ను పుల్లారావు వెంబడించాడు – ఇద్దరం నా స్టడీరూంలో కూర్చొని మాట్లాడుకోవడం మొదలెట్టాం.

"యాక్సిడెంట్... యాక్సిడెంట్... ఎక్కడ చూసినా యాక్సిడెంట్సే... మీ ఫ్రెండ్‌కు యాక్సిడెంట్ ఎలా అయిందో చెప్పండి" అన్నాడు పుల్లారావు.

"మా ఫ్రెండంటే ఎవరనుకున్నారు. ఆయన కూడా ఓ గొప్ప రచయితే... ఒక ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆయనకు రోడ్డు క్రాస్‌చెయ్యడమంటే చాలా భయం. సాధ్యమైనంతవరకు ఆయన మన సిటీలో రోడ్లను తనంతట తానుగా క్రాస్ చేసే ప్రయత్నం చేసేవాడు కాదు – ఎంత దగ్గరి ప్లేస్‌కెళ్ళాలన్నా ఆటో మాట్లాడుకొని వెళ్ళేవాడు – తను ఎవరింటికైతే వెళ్ళాలో వాళ్ళింటి ముందే ఆటో దిగేవాడు – అలాంటి వాడు మొన్న అర్ధరాత్రి ఓ పెళ్ళికెళ్లొస్తూ రోడ్ల మీద ఎక్కువ ట్రాఫిక్‌లేదు కదా అని రోడ్డు క్రాస్ చెయ్యబోయాడు. ఆ టైమ్‌లో ఆ రోడ్డు మీద అస్సలు ట్రాఫిక్ లేదు. నిర్మానుష్యంగా ఉంది – రోడ్డు క్రాస్ చేసి ఓ 20 గజాలు నడిస్తే వాళ్ళిల్లే... అందుకే ఆయన ఎప్పుడూ అకస్మాత్తుగా కొంచెం దూరంలో చాలా వేగంగా వస్తున్న ఓ స్కూటర్ కనిపించింది. ఇతనికి భయమేసింది. ఆగితే సేఫ్ అనుకొని ఆగిపోయాడు. అంతే–మరుక్షణంలో ఆ స్కూటరొచ్చి ఇతన్ని గుద్దేసింది – సరిగ్గా మడమ దగ్గర కాలు లోపలి బోన్ రెండు ముక్కలుగా విరిగి పోయింది – ఇంకాస్త పైన విరిగినా త్వరగానే అతికిపోయేదట... ఇప్పుడు చూడండి... అతడెంత అవస్థపడ్తున్నాడో మనం ఊహించలేం... ఆపరేషన్ థియేటర్లోకి తీసికెళ్ళి ఆయన కాలికి ఆపరేషన్ చేశారు. ఆపరేషనంటే ఏమిటనుకున్నారు? కర్రకు రంధ్రాలు చేస్తారు చూడండి... అలా డ్రిల్లింగ్ మెషీన్‌తో రంధ్రాలు కాలికి చేసి నెయిల్స్‌కుచ్చారు. ఆయన కదలకుండా బెడ్‌మీదనే మూడునాలుగు నెలల వరకుండాలట... ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా నిండు చైతన్యంతో తొణికిసలాడే ఆయనను అలా చూస్తుంటే ఎంత బాధనిపించిందో చెప్పలేను. శిలువ వేయబడిన క్రీస్తును చూస్తున్నట్లుగా అనిపించింది" అన్నాన్నేను.

"అయ్యోపాపం! ఎంత ఘోరం జరిగిపోయింది. ఆయన రోడ్డును క్రాస్ చేస్తున్నప్పుడు మధ్యలో ఆగి ఉండాల్సింది కాదేమో! అలా వెళ్ళిపోతున్నవాడు వెళ్ళిపోతే ఈ యాక్సిడెంట్ జరిగిఉండేది కాదేమో" అన్నాడుపుల్లారావు.

"అవును... ఆయన కూడా ఈ మాటే అన్నాడు. స్కూటర్ మీద వస్తున్న వాడు అతడు ఆగిపోతాడని ఊహించలేదు. అతడు వెళ్ళిపోతాడనే అనుకొని ఉంటాడు... అతడు ఆగిపోవడం, ఇతని స్కూటర్ వెళ్ళి అతన్ని గుద్దెయ్యడం... రెండూ ఒకేసారి జరిగిపోయాయి. చాలా మంది సిటీలోని పెద్ద రోడ్ల మీద కాలినడకన వెళ్తున్న వాళ్ళేమనుకుంటారంటే ఏదన్నా వెహికల్ తమ మీదకొస్తున్నదనుకున్నప్పుడు టక్కున ఆగిపోవడం క్షేమం అనీ. కానీ అనేకసార్లు అలా అకస్మాత్తుగా నడుస్తున్నవాడు ఆగిపోవడంతో వెహికల్స్‌ని డ్రైవ్ చేసే డ్రైవర్లు చాలా కన్‌ఫ్యూజ్ అయిపోతారు. చాలా దగ్గరికొచ్చాక వాళ్ళలా ఆగిపోవడంతో డ్రైవర్లు ఏమీ చెయ్యలేకపోతారు. రోడ్డు క్రాస్ చేస్తున్నప్పుడు వెహికల్ దగ్గర పడ్తోందనుకున్నప్పుడు కాస్త వేగంగా వెళ్ళిపోవడమే బెటర్. ఇంకో విషయమేమిటంటే కొందరికి రోడ్ క్రాస్‌చెయ్యడమంటేనే భయం... దీన్నే సైకాలజీలో ఫోబియా అంటారు. ఈ రోడ్డు ఫోబియా ఉన్న వాళ్ళు రోడ్డు క్రాస్ చేస్తున్నప్పుడు ఏదో ఓ చిన్నదో, పెద్దదో పొరపాటు చేస్తూనే ఉంటారు. కొన్నిసార్లు చాలా చిన్న పొరపాటు కూడా ఎంతో విలువైన ప్రాణాన్ని హరించవచ్చు. మరో విషయమేమిటంటే మన పట్టణాల్లోని రోడ్ల మీద వాహనాల జనాభా పిచ్చిగా పెరిగిపోయింది. ఇవ్వాళ్ళ ఇంటికొక్క టూవీలరో, ఫోర్ వీలరో తప్పనిసరిగా ఉంటోంది. వాహనాల సంఖ్య ఇంత గణనీయంగా పెరిగిపోయినా మన రోడ్ల మీద సౌకర్యాలు మాత్రం ఏమీ పెరగలేదు. వెహికల్స్ డ్రైవ్ చేసే వాళ్ళకుగానీ, కాలి నడకన వెళ్ళే పాదచారులకు గానీ ట్రాఫిక్ రూల్స్‌ని గూర్చిన పరిజ్ఞానం చాలా తక్కువ. ట్రాఫిక్ పోలీసు వాడు చూడటం లేదనుకుంటే మనవాళ్ళు ట్రాఫిక్ రూల్స్‌ని బ్రేక్ చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అలాంటప్పుడు యాక్సిడెంట్స్ జరక్కుండా ఎలా ఆపగల్గుతాం..."

"హైదరాబాద్‌లాంటి పెద్ద సిటీలో రోడ్డు క్రాస్ చెయ్యడం అంటే నాకూ చాలా భయంగానే ఉంటుంది. అందుకే నేను కూడా సాధ్యమైనంత వరకు రోడ్డు క్రాస్ చెయ్యడాన్ని ఎవాయిడ్ చెయ్యడానికే ప్రయత్నిస్తాను"

"అయినా కొన్నిసార్లు రోడ్డు క్రాస్ చెయ్యక తప్పదు కదా... పెద్ద సిటీస్‌లో రోడ్లు క్రాస్ చెయ్యడానికి కొన్ని ప్రత్యేకమైన ప్లేసెస్‌ని ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చెయ్యాలి. కాలి నడకన వెళ్తున్న వాళ్ళందరూ ఆ ప్రదేశంలోనే రోడ్లు క్రాస్ చెయ్యాలని నిర్దేశించాలి. ఎక్కడపడ్తే అక్కడ రోడ్లు క్రాస్ చేసే వాళ్ళను అలా చెయ్యకుండా ఆపెయ్యాలి. ఎక్కడైతే రోడ్లను క్రాస్ చేసే ప్రదేశాల్ని ఏర్పాటు చేశారో అక్కడ రోడ్లను క్రాస్ చెయ్యడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగవనే ఆత్మ విశ్వాసాన్ని ప్రజల్లో కల్గించాలి. అలాగే ఈ సమస్యకు మరో పరిష్కారమేమిటంటే మరీ రద్దీగా ఉండే ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ సబ్‌వేలను నిర్మించడం. విదేశాల్లో ఇలాంటి సబ్‌వేలు చాలా ఎక్కువగా ఉంటాయి. మన దేశంలో కూడా ఇప్పుడిప్పుడే ఈ సబ్‌వేల అవసరాన్ని గుర్తిస్తున్నారు..."

ఔనండోయ్! మన హైదరాబాద్‌లో కూడా మూడు నాలుగు చోట్ల అండర్ గ్రౌండ్‌సబ్‌వేలు వున్నట్టు చూశాను. నేనైతే వాటిగుండా ఎప్పుడూ వెళ్ళలేదనుకోండి. ఎందుకో వాటి గుండా వెళ్ళాలంటే భయమేస్తుంది"

"మీరేకాదు... చాలా మంది పాదచారులు సబ్‌వేలను ఉపయోగించుకోవడానికి అలవాటు పడటం లేదు. ట్రాఫిక్ పోలీసులు సబ్‌వేలను గురించి పాదచారులకు చెప్పాలి. వాటిగుండా వెళ్ళడాన్ని ప్రోత్సహించాలి. అవి ఎక్కడెక్కడున్నాయో తెలిపే సైన్ బోర్డులు కూడా ఉండాలి..."

"మొత్తమ్మీద పెద్ద సిటీస్‌లో రోడ్లను క్రాస్ చెయ్యడం కూడా ఎంత రిస్కో మీరు బాగా చెప్పారు" అంటూ పక్కింటి పుల్లారావు వెళ్ళిపోయాడు. ★

సేపు...



"కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె నూయల లూపు
ఓ కూనలమ్మా... ఆహా! ఆరుద్రగారు ఏం బాగా చెప్పారు ఈ పద్యం" అంది మధురవాణి.

"కవిత బాగుంది కానీ... ఏదో ఇబ్బంది ధ్వనిస్తోంది. గురువు గురజాడ గారి ముత్యాలసరాల కంటే... ఆరుద్రగారి కూనలమ్మ పదాలు ఎటూ మిన్నకావు సుమా..." అన్నాడు గిరీశం.

"ఆహా! వేటి సొగసు వాటిదే! ఏమిటో ఈ పద్యంలో మీకు బాగులేనిదీ.." మధురవాణి దీర్ఘం తీసింది.

"ఆ మాటకొస్తే... నేను రాసిన పద్యాలకంటే ఎవరి పద్యాలు మిన్నగావు.. నేను విడో మీద రాసిన పద్యం రిఫార్మర్‌లో అచ్చయితే ఆంగ్ల కవులంతా గుండె కొట్టుకున్నారు.

ఈ పద్యంలో బాగులేనిది ఏమిటో అని అడిగావ్? అలా అడుగు చెపుతాను. 'కొన్ని తరముల సేపు' అనడం బాగులేదు. 'సేపు' అన్న పదం కొద్ది సమయానికే వాడాలి"

"సారస్వతంలో ఆ మాత్రం చమత్కారం సొగసుగానే ఉంటుందని మీరు కాదా? చెప్పారు"

– "ఓహో! నేను చెప్పానా? సరే ! అయితే బాగునే ఉంది. ఆ మాటకొస్తే ఆరుద్ర నేరాసిన పొయిట్రీ నుంచి కాదా? పదాలు ఎత్తుతాడు. అదేమంటే పరిశోధనంటాడు"

"సరే గిరీశంగారొక్కరే కవులు మరి!" మధురవాణి వెటకారంగా అంది. గిరీశం నోరు మూతపడింది.

★ ★ ★

క్లుప్త పదాల కూనలమ్మ పదాల్లో ఆరుద్ర గారు 'సేపు' అనే సాధారణ పదానికి విస్తృత అర్థాన్నివ్వడం నిజంగా సొగసుగానే ఇమిడింది సుమా!

ఈ 'సేపు' అనే పదం కాలపరిమాణార్థంలో వాడతాము. దీనికి స్వతంత్ర ప్రయోగం లేదు. నిఘంటువుల్లో 'సేపు' అంటే సమయం అనే అర్థాన్నిచ్చారు. కాని 'సమయమెంత? అంటాం తప్ప 'సేపు ఎంత?' అనంకదా!

తమిళంలో "ఎన్న పొళ్లుద్దు?" అనంటారు. అంటే "పొద్దు ఎంత?" అని. తమిళులు కొందరు "సేపు ఎంత?'' అని కూడా అంటారని తిరుమల రామచంద్రగారు రాశారు.

సేపు మూలరూపం సెహప్పు. అంటే ఎరుపేమో అని ఆయన పేర్కొన్నారు. సూర్యుడు అని అర్థం చెప్పుకోవచ్చుంటారు ఆయన.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'సేపార్చు' అనే పదమిచ్చి సేపును నిలుపు, కాలము నిలుపు అనే అర్థాలిచ్చారు.

ఉత్తర హరివంశంలో "యహరయింత సేపార్చి గరం.." అనే ప్రయోగం ఉంది. 'సేపు'ను కూడా విడిగా వాడగలిగితే మనకొక అదనపు పదం ఉండేది కదూ!.

★ ★ ★

అలాగే తెలుగునాట 'నక్కను తొక్కడం' అనే ప్రయోగం ఉంది. 'నక్కను తొక్కి వచ్చాడు' అంటే అన్నీ శుభాలే జరుగుతున్నాయని గానీ, అశుభాలను తప్పించుకోగలుగుతున్నాడని వ్యవహారికార్థం. ఇదీ తమిళ మాతృక నుంచి ఉద్భవించినదేననవచ్చును.

నక్కను తొక్కడానికి, శుభానికి ఏమిటి సంబంధం? అనేది ప్రశ్న.

తమిళంలో 'నరి' అంటే పులి. దీనికి బహువచనం నరికళ్. ఇది కాస్త 'నక్కల్' అని మారి ఉంటుందని పరిశోధకులంటున్నారు. పులి మనిషిని చూచినా, మనిషి పులిని చూచినా ముప్పు మనిషికే. పూర్వం ప్రయాణాలు కాలినడకన అడవుల గుండా సాగేవి. ఏ తెల్లవారుజామునో పరుండిన పులిని పొరపాటుగా ఏ మనిషైనా తొక్కి బతికి బయటపడగలిగితే అతనంత అదృష్టవంతుడు ఉండడుగదా మరి! ఇలాంటి సంఘటనేదో ఈ నానుడికి కారణమై ఉంటుందంటారు. ఇదీ నక్కను తొక్కడమంటే! ★

పాఠక స్పందన

సంచలన భరిత 2001

30-12-2001 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన కవర్ స్టోరీ 'సంచలన భరిత సంవత్సరం 2001' వ్యాసంలో సంవత్సరంలో జరిగిన అనేక అంశాలను తెలియ జేయడం బాగుంది. గుజరాత్ భూకంపం విషయాలను కూడా చేర్చి వుంటే ఇంకా బాగుండేది. ఆరోగ్యం శీర్షికలో ప్రచురించిన కామెర్ల వ్యాధికి సంబంధించిన విషయాలు విజ్ఞాన దాయకంగా వున్నాయి.

– మానస, హైదరాబాద్

గుబాళించిన గులాబీ నగరం

డిసెంబర్ 30వ తేదీ సంచికలో ప్రచురించిన జైపూర్ విశేషాలు ఆసక్తిదాయకంగా వున్నాయి. అనేక విషయాలు కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. అందులోని విషయాలు చదివితే జీవితంలో ఒక్కసారైనా జైపూర్‌ను చూసి తీరాలి అనిపించింది. క్రీడా రంగ విశేషాలు కూడా ఆకట్టుకున్నాయి. రియల్ స్టోరీ ఉద్వేగ భరితంగా సాగింది.

– అనూష, వెనిగండ్ల, గుంటూరు